


# పురుషోత్తముడి ఫోటో

పురుషోత్తమరావు గుండె చప్పుడు మాత్రమే అక్కడ వినిపిస్తోంది. వరండా నిర్మానుష్యంగా వుంది. దూరంగా మెట్లదగ్గిర కూర్చొని కునికిపాట్లు పడుతున్నాడు నౌఖరు.

ఆ వాతావరణమే ఒక రకమైన గంభీరతతో నిండి వుంది.

పక్కకుర్చీలన్నీ ఖాళీగా వున్నాయి. అతడే ఆఖరి విజిటరు. తన వంతుకోసం చూస్తున్నాడు. లోపల కలెక్టరు ఎవరితోనో మాట్లాడుతున్నాడు.

పురుషోత్తమరావుకి భయంగావుంది. తను ఎందుకు పిలవబడ్డాడో అర్థంకావటం లేదు. ప్రొద్దున్న పిలుపు వచ్చినప్పటి నుంచీ అతడి గుండె వేగంగా కొట్టుకొంటూనే వుంది. తనేం తప్పుచేసేడా అని మధనపడుతూనేవున్నాడు.

అతడు ముప్పైఏళ్ళక్రితం ఎల్డీసీగా చేరాడు. పదేళ్ళకి ప్రమోషన్ వచ్చింది. ఆ తరువాత లంచం తీసుకుంటూ వుండగా పట్టుబడి ఉద్యోగం పోవలసినంత పనయి, రివర్షనొచ్చి, చావు దప్పి కన్నులొట్టబోయినంత పనయింది. ప్రస్తుతం యూ.డి.సీ. గా పనిచేస్తూ రిటైర్‌మెంటు కోసం చూస్తున్నాడు. ఇదీ ఎంతో దూరంలో లేదు. ఇక రెండు సంవత్సరాలు మాత్రమే వుంది.

కలెక్టర్ కుమార్, ఐయ్యేయస్ తనని ఎందుకు పిలిచివుంటాడో పరిపరివిధాల ఆలోచిస్తున్నాడు. కుమార్ చాకులాటి కుర్రవాడనీ, నిక్కచ్చి మనిషనీ వచ్చిన కొద్ది రోజుల్లోనే పేరుతెచ్చుకున్నాడు. ఆఫీసుకంతా అత్యంత పెద్ద పొజిషన్‌లోవున్న ఆ అధికారి, యంత్రాంగంలో చిన్న బోల్టులాంటి తనని పనిగట్టుకు ఎందుకు పిలిపించి వుంటాడు? అందులోనూ అతడీ పదవీ బాధ్యత స్వీకరించి పట్టుమని మూడు నెలలుకూడా కాలేదాయే.

ఎలాగూ రిటైరవబోతున్నాను కదా అని కొద్దిగా ధైర్యంచేసి మొన్నమొన్నే తిరిగి మొదలుపెట్టిన లంచం గురించిగాని కొంపదీసి తెలిసిందా? లేక తను పుటప్ చేసిన నోట్‌లో ఏదైనా ఘోరమైన తప్పు దొర్లి స్వయంగా చివాట్లు పెడ్దామని అనుకుంటున్నాడా?

తలుపు చప్పుడయ్యేసరికి ఆలోచనల్లోంచి తేరుకున్నాడు. స్వింగ్ డోర్ తెరుచుకుని ఆ విజిటర్ వెళ్ళి పోయాడు. బెల్ మ్రోగింది.

నౌఖరు హడావుడిపడుతూ లోపలికి వెళ్ళొచ్చి "మిమ్మల్ని పిలుస్తున్నారు" అని తన స్థానంలోకి వెళ్ళి పోయాడు.

పురుషోత్తం తడబడే అడుగుల్తో ఆ విశాలమైన గదిలోకి ప్రవేశించాడు. పొడవాటి టేబిల్‌ముందు కూర్చొని వున్నాడు కుమార్ టై క్రిందకి లూజ్ చేసుకుని ముందుకు వంగి ఫైలు చూస్తున్నాడు. పాతిక సంవత్సరాల వయసుంటుంది. అతడికి పొద్దున్నుంచీ పనిచేసిన అలసటని కళ్ళు సూచిస్తున్నా - వాటిలో విజ్ఞానం కొట్టొచ్చినట్టు కనబడుతూంది. ఒక ముంగురులపాయ విశాలమైన నుదుటిమీదకి జారింది. చొక్కా మోచేతులవరకూ మడిచి ఇన్‌షర్టు చేసేడు. ఫైలు పట్టుకున్న ఆ వేళ్ళు ఎంతో బలంగా ధృఢంగా వున్నాయి.

పురుషోత్తానికి ఏం చెయ్యాలో తోచలేదు. అతడు తనని గమనించనట్టులేదు. ఏకాగ్రతతో ఫైలు చదువుతున్నాడు. కుర్చీలో కూర్చొనే సాహసం చెయ్యలేదు అతడు. అసలు ఆ డిపార్టుమెంట్‌లో అలాటి ఆలోచనే రాదు.

ఎందుకో తెలీదుకానీ అతడికి తన గతం గుర్తొచ్చింది. ఆ వయసులో తనెలా వుండేవాడు? అప్పుడే డిపార్టుమెంట్‌లో చేరిన కొత్త స్నేహితులూ, అర్థరాత్రివరకూ తిరగటం, కిళ్ళీలు నముల్తూ బాధ్యతారహితంగా తిరగటం . . . ఈ కుర్రాడు ఈ వయసులోనే ఇంత గంభీరతని సంతరించుకున్నాడంటే గొప్పే. అవును మరి ఎంత గొప్ప కాకపోతే, ఎంత కష్టపడకపోతే ఇంత చిన్న వయసులో ఇంత పెద్ద పదవి సంపాదించగల్గుతాడు?

"అరే - మీరు నిల్చునేవున్నారా కూర్చోండి" తలెత్తిన కుమార్ అతడిని చూసి అన్నాడు. బెల్‌కొట్టి నౌఖర్ని పిలిచి "ఇంకెవరైనా వున్నారా" అని అడిగి, అతడు లేరనగానే, "కూర్చోండి, ఒక అయిదు నిముషాల్లో వెళ్ళిపోదాం" అని, పురుషోత్తం కూర్చోగానే తిరిగి ఫైలు చదవటంలో మునిగిపోయాడు.

కుర్చీలో కూర్చొన్నాడన్న మాటేగాని పురుషోత్తానికి ఏమీ అర్థం కావటంలేదు. అంత పెద్ద అధికారి ముందు ఇలా కుర్చీలో కూర్చోవటం ఇబ్బందిగానే వుంది. అంతకన్నా పెద్ద ఇబ్బంది - విషయం తెలియకపోవటం. చేతులు కట్టుకొని నిల్చోని చివాట్లు తినటమే అతడికి తెలుసు. ఇలాటి ఆదరణ అతడికి ముప్ఫైఏళ్ళ సర్వీసులో ఎప్పుడూ లభించలేదు.

"మనం వెళదామా" అంటూ లేచాడు కుమార్. ఎక్కడికి అని అడక్కుండా అతడిని అనుసరించాడు. ఇద్దరూ బైటకొచ్చారు గదిలోంచి.

మెట్లదగ్గిర కారు ఆపుచేసి పక్కనే నమ్రతగా నిలబడ్డాడు డ్రైవరు. నౌఖరు బ్రీఫ్‌కేసు తీసుకొచ్చి కార్లో పెట్టాడు. పియ్యే వరండా స్తంభం పక్కన చేతులు కట్టుకుని వున్నాడు. తెల్లటికారు లేయండలో మిలమిలా మెరుస్తూంది.

"నువ్వు తరువాత జీపులో రా" అని డ్రైవర్‌కి చెప్పి స్టీరింగ్ దగ్గర కూర్చొని పక్కడోర్ తెరుస్తూ "రండి" అన్నాడు పురుషోత్తంతో. కలలోగా అతడు వెళ్ళి కూర్చున్నాడు. మఖమల్ కవరున్న సీటు కూర్చోగానే మెత్తగా తగిలింది.

కారు కదిలింది.

చాలాసేపటివరకూ కుమార్ మాట్లాడలేదు. ఒక చెయ్యి స్టయిల్‌గా విండోమీద ఆన్ని ఏకాగ్రతతో డ్రైవ్ చేస్తున్నాడు. కారులోకి చల్లగా వీస్తున్న గాలి ఆహ్లాదకరంగా వుంది.

"ఎంత మంది సంతానం మీకు పురుషోత్తంగారూ."

"ముగ్గురమ్మాయిలూ - ఇద్దరబ్బాయిలూ సర్" అన్నాడు పురుషోత్తం.

"అబ్బాయిలు ఏం చేస్తున్నారు?"

"పెద్దవాడు బియ్యే తప్పేడండి. రెండోవాడు మెట్రిక్యులేషన్ వరకూ చదివి మానేసాడు సార్."

"ఆడపిల్లలూ ముగ్గురూ పెద్దవాళ్ళనుకుంటా."

"అవున్సార్."

కుమార్ తలతిప్పి అతడివంక చిరునవ్వుతో చూస్తూ "నన్ను సార్ అనక్కర్లేదు. ఇది ఆఫీసు కాదుకదా" అన్నాడు. పురుషోత్తం ఏదో తెలియని భావంతో తబ్బిబ్బు అయ్యాడు.

"మీ ఇల్లెక్కడ పురుషోత్తం గారూ"

"గాంధీపార్కు పక్కసందులో సార్."

"ముందు మా ఇంటికి వెళదాం" కుమార్ డ్రైవ్ చేస్తూ తల తిప్పకుండా అన్నాడు. ఎందుకని అడిగే సాహసం చెయ్యలేక పోయాడు ఆయన.

కారు తారురోడ్డుమీద మెత్తగా జారిపోతూంది.

"సరోజిని మీకు తెలుసా పురుషోత్తంగారూ? పేరెప్పుడైనా విన్నారా?"

హఠాత్తుగా వచ్చిన ఈ ప్రశ్నకి పక్కలో బాంబు పడ్డట్టు ఉలిక్కిపడి, కుమార్‌వైపు చూసేడు. కుమార్ రోడ్డు మీదనుంచి దృష్టి మరల్చ లేదు. అతడి మొహంలో ఏ భావమూ లేదు.

పురుషోత్తం జవాబు చెప్పటానికి క్షణం తటపటాయించాడు. ఈ క్షణంలోనూ లక్ష ఆలోచన్లు అతడి మనసులో ముసురుకొన్నాయి.

పాతిక సంవత్సరాల క్రితం తన జీవితం నుంచి తప్పుకున్న సరోజ ప్రసక్తి ఇప్పుడితడు ఎందుకు తెస్తున్నాడు? ఏనాడో మర్చిపోయిన ఆ చీకటి తప్పుని ఎలా వెలికి తియ్యగలిగాడు? అతడి కళ్ళముందు సరోజ మెదిలింది. తనని అన్యాయం చెయ్యవద్దని బ్రతిమాలిన సరోజ. . తను పట్టిమనిషిని కానని కళ్ళనీరుపెట్టుకున్న సరోజ . . . చివరి క్షణం వరకూ రహస్యాన్ని తనలోనే దాచుకొని కుమిలిపోయిన సరోజ . . .

కట్నానికి ఆశపడి నాంచారిని కట్టుకుంటున్నప్పుడు - పెళ్ళిపందిట్లో పసుపు బట్టల్లో వుండగా కబురొచ్చింది. సరోజ ఆత్మహత్య చేసుకోబోయిందనీ - రక్షించారనీ, కానీ చావుకి ముందు పెట్టిన ఉత్తరంలో తన పేరుండటంతో పందిరిలో వార్త గుప్పుమంది.

అయినా తనకేం? మొగవాడు. అరగంటైనా తిరగకుండానే - మంగళవాద్యాల మ్రోతలో నాంచారికి మూడు ముళ్ళు వేసేడు.

తరువాత తెలిసింది - తలెత్తుకోలేక సరోజ తండ్రి కూతుర్ని తీసుకుని వూరు విడిచి వెళ్ళిపోయాడనీ, ఆ తరువాత కొన్నాళ్ళకి లోకాన్ని విడిచి వెళ్ళిపోయాడనీ! సరోజ మాత్రం ఏమయిందో తెలియలేదు.

పురుషోత్తానికి భయం వేసింది. ఆవిడ బ్రతికేవుందా? తనమీద ఏ అర్జీ అయినా పెట్టుకుందా? ఇతడు తనమీద పోలీసు ఎంక్వయిరీకి ఉత్తర్వు ఇచ్చాడా? తనని పోలీసు స్టేషన్‌కి తీసుకెళుతూన్నడా?

- క్షణంలో ఎన్నో ఆలోచనలు అతడిని చుట్టుముట్టాయి.

"జవాబు చెప్పరే?".

పురుషోత్తం చేతులు వణకసాగేయి. తడి ఆరిన గొంతుతో "తె. . . తెలుసు" అన్నాడు.

కుమార్ అతడి జవాబుని పట్టించుకోలేదు. అతడి వైపు చూడకుండానే డ్రైవ్ చేస్తూ చెప్పసాగేడు. కారు నిశ్శబ్దంగా వెలుతూంటే అతడి కంఠం మంద్రస్థాయిలో వినిపించింది.

తండ్రి పోయేసరికి సరోజ నిండు గర్భవతి. ఇళ్ళల్లో పాచి పన్లు చేస్తూ పిల్లవాణ్ణి పెద్దచేసింది. లోకం పొడిచే సూటి పోటి మాటలకి మనసు రాయి చేసుకొని ఏకైక ధ్యేయంతో పాటుబడింది. ఆమె ధ్యేయం ఏమిటో తెలుసా పురుషోత్తంగారూ . . . కొడుకుని ఒక ఉన్నతస్థానంలో చూడటం. కానీ చెప్పినంత సులభం కాదది. ఎందుకంటే జీవితం కథ కాదు కాబట్టి.

ఆ అర్థరాత్రుళ్ళు ఆ తల్లి మనసు మౌనంగా రోదించటాన్ని అర్థం చేసుకున్నది, ఆమె ఎనిమిదేళ్ళ కొడుకు మాత్రమే. ఆ వయసులోనే తన బాధ్యత గ్రహించాడు ఆ కుర్రవాడు. వీధి

లాంతరు వెలుగులో చదువుకొంటూ విధినే పరిహసించగల స్థాయికి చేరుకున్నాడు.

కాలగర్భంలో సరోజ 'సరోజనమ్మ' అయింది. అయినా ఆమెకింకా నమ్మకమే, తనని అతడు మోసం చెయ్యలేదనీ, పరిస్థితుల ప్రభావంవల్లనే వదిలివేశాడనీ . . . అందుకనే గదిలో ఫొటో పెట్టుకునీ, దాన్ని గుండెల్లో నింపుకొనీ ఇంకా బ్రతుకుతోంది."

- అతడి కంఠం మారిపోయింది. ఈసారి సరమైన స్వరంతో అన్నాడు.

"ఆ ఫొటోని రోజూ చూసే నేను - ఈ రోజు మిమ్మల్ని ఆఫీసులో చూసేసరికి ఆశ్చర్య పోయాను. అమ్మకి ఫోన్ చేసి - మిమ్మల్ని కనుక్కున్నాననీ, తీసుకువస్తున్నాననీ చెప్పాను. కొడుకు ఐయ్యేయస్ ఆఫీసర్ అయ్యాడని తెలిసినప్పటికన్నా ఎక్కువ సంతోషాన్ని అనుభవిస్తోంది ఆ మాతృమూర్తి. ఈ విశాల ప్రపంచంలో మిమ్మల్ని తిరిగి కనుక్కోగలననే ఆశనే దాదాపు వదిలేసుకుందామె" అంటూ సర్రున స్టీరింగ్ తిప్పాడు.

విశాలమయిన కాంపౌండ్‌లోకి బాణంలా దూసుకొచ్చిన కారుని చూసి తోటమాలి చప్పున లేచొచ్చాడు. నౌఖరు నమ్రతగా పరుగెత్తుకు వచ్చాడు. గూర్ఖా స్టిఫ్‌గా నిలబడ్డాడు.

కుమార్ కారు దిగి ఇటొచ్చి తలుపు తీసి 'దిగండి' అనేవరకూ పురుషోత్తానికి స్పృహలేదు. అతడు రెండోసారి పిలిచేసరికి ఈ లోకంలోకి వచ్చి కారు దిగాడు. దిగి, నడిచి మెట్లు ఎక్కుతున్నాడన్నమాటేగానీ అతడికి తను విన్నది కలనో నిజమో అర్థం కాలేదు. కారు అలికిడికి లోపల్నుంచి బైటకు వచ్చిన సరోజనమ్మ అతడిని చూసి అక్కడే నిలబడి పోయింది. జరుగుతున్నదంతా వాస్తవమని అప్పుడు అర్థమయింది అతడికి. ఆమెకి నలభై దాటింది వయసు. పడిన కష్టానికి ప్రతిరూపంగా జుట్టు తెల్లబడింది.

"సరోజా!" అన్నాడు కంపిస్తున్న గొంతుతో.

అంతే! ఆమె ఒక్క వూపున అతడి చేతుల దగ్గిర వరకూ వచ్చి, చుట్టూవున్న మనుష్యుల్ని చూసి అతి కష్టం మీద నిగ్రహించుకుంది. కానీ ఆమె శరీరం కంపిస్తూనే వుంది. కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. ఆనందంతో వచ్చిన దుఃఖంతో కంఠం పూడుకుపోగా "...ఏవండి, మన బాబండీ!" అంది కుమార్‌ని చూపిస్తూ. పాతిక సంవత్సరాల కలయిక తరువాత వచ్చిన మొట్టమొదటి మాట అది.

ఆ ఒక్క మాటలో ఎన్నో అర్థాలున్నాయి. ఆమె పడిన కష్టాలూ - దానివల్ల వచ్చిన ఫలితం - మూర్తీభవించి అక్కడ నిలబడి వున్నట్టూ, ఆ శిల్పాన్ని చెక్కుకోవటానికి తను పడిన కష్టాన్ని తన భర్త గుర్తించాలి అన్న తపన ఆ స్వరంలో ప్రస్ఫుటించింది.

పురుషోత్తానికి మబ్బుల్లో తేలిపోతున్నట్టు వుంది. తను చేసిన తప్పు ఒప్పై - ఒక ఐ య్యే ఎస్ ఆఫీసర్ రూపంలో కొడుగ్గా నిలిచింది. అదీగాక సరోజిని క్షమించింది. అంతకన్నా ఆనందం ఏముంటుంది?

ఆ ఆనందంలో నోట మాట పెగల్లేదు.

కుమార్ దగ్గరగా వచ్చి "నాన్నగారూ!" అంటూ వంగబోయాడు. పురుషోత్తం చప్పున అతడి భుజాలు పట్టుకుని ఆపుచేస్తూ "బాబూ!" అంటూ హృదయానికి హత్తుకొన్నాడు. తన ముందు ఠీవిగా కూర్చొన్న కలెక్టరు తన కొడుకై ఇలా తామిద్దర్నీ కలుపుతాడని అనుకోలేదు అతడు.

సరోజినమ్మ తేరుకొని, కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ "లోపలికి రండి' అంటూ హాల్లోకి దారి తీసింది. పురుషోత్తం వారితోపాటే లోపలికి నడిచాడు.

హాలెంతో అందంగా వుంది. చిన్నబల్లమీద ఎర్రటి ఫోను నేలమీద తివాచీ రంగుతో పోటీపడుతూంది. సోఫా సెట్టు మధ్యలో టీపాయ్ దానిమీద ఆష్ట్రే అన్నీ ఒకే రంగులో వున్నాయి. అంతపెద్ద ఇంట్లో ఇద్దరే వుంటున్నారన్న భావంరాగానే అతడికి తన ఇల్లూ ఇరుకు గదులూ జ్ఞాపకం వచ్చాయి.

"కూర్చోండి, కాఫీ తీసుకొస్తాను" అంటూ లోపలికి వెళ్ళింది ఆమె. అతడి దృష్టి గోడకున్న ఫోటోమీద పడింది. అది తన ఫోటోనే పాతిక సంవత్సరాల క్రితం కొత్తమోజుతో సరోజకిచ్చింది.

"నాన్నగారూ" అన్న పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాడు. కుమార్ సోఫాలో పక్కనే కూర్చుంటూ "ఇలా మిమ్మల్ని తీసుకురావటం ద్వారా ఇబ్బందిలో పెట్టానా?" అన్నాడు.

"ఏమిటి బాబూ నువ్వంటున్నది. ఇబ్బందా? ఇంకెప్పుడూ పొరబాటునైనా అలాంటి మాట రానివ్వకు" అన్నాడు పురుషోత్తం నొచ్చుకుంటూ.

"మీ కిబ్బంది లేకపోవచ్చు నాన్నా. కానీ పిన్నికీ, పిల్లలకీ . . .ఇన్నేళ్ళ తరువాత . . ." అంటూ అర్థోక్తిలో ఆపుచేసేడు.

"ఎవరు నాంచారా - దానిమొహం . . . ఆ మాటకొస్తే సరోజే నా మొదటి భార్య. తనకే ఎక్కువ హక్కుంది. అయినా నాంచారి సంగతి మీకు తెలీదు. నాకన్నా ఎక్కువగా అదే సంతోషిస్తుంది" అన్నాడు.

"అలా అయితే అంతకన్నా కావల్సింది ఏముంది. అందరం ఒకసారి వద్దు. ముందు మీరు వెళ్ళండి. తరువాత అమ్మని తీసుకుని నేను వస్తాను. ఈ లోపులో సంగతంతా వాళ్ళకి మీరు చెప్పండి. అందరం ఒకసారి వెళితే వాళ్ళు ఇంత నిజాన్ని తట్టుకోలేకపోవచ్చు" అని, నెమ్మదిగా "అమ్మ తన శేషజీవితాన్ని మీ సన్నిధిలో గడపాలని నాకు ఊహ తెలిసినప్పటినుంచీ కోరుకుంటూంది నాన్నగారూ" అన్నాడు.

ఈలోగా సరోజినమ్మ కాఫీ కప్పుతో వచ్చింది. "ఇక నేను చూసుకుంటాగా బాబూ" అంటూ కప్పు అందుకున్నాడు పురుషోత్తం.

* * *

ఆ వీధిలోంచి అసలు కారు ఇట్నుంచి అటువెళ్ళదు. అటువంటిది - వచ్చి ఆగేసరికి పిల్ల లేమిటి, పెద్దలే కుతూహలంగా చూడసాగేరు.

ముందు కుమార్ దిగాడు. వెనుకే పట్టుచీరె భుజాల నిండా కప్పుకొని సరోజినమ్మ మెట్లెక్కింది. పురుషోత్తం లోపల్నుంచి హడావుడిగా వస్తూ "రండి, మీకోసమే చూస్తున్నాం" అంటూ కళ్ళప్పగించి చూస్తున్న కూతురి వైపు తిరిగి, "అలా చూస్తావేమిటే పిచ్చి మొహవా, అన్నయ్య . . . " అన్నాడు. ఈ లోపులో నాంచారమ్మ వచ్చింది, "రండి అక్కయ్యగారూ" అంటూ.

"నే చెప్పాను కదా" అన్నట్టు పురుషోత్తం వాళ్ళ వైపు చూసేడు.

అయిదు నిముషాల్లో అక్కడి వాతావరణం మారిపోయింది. పిల్లలకి కుమార్ అంటే చనువు ఏర్పడింది. పెద్ద పిల్లకి మరీనూ! "అన్నయ్యా - నేను చదువుకుంటానంటే నాన్న వద్దంటున్నాడు. మొగపిల్లలకే అబ్బలేదు నీకెందుకూ - అంటున్నాడు. నువ్వే చెబ్దూ."

కుమార్ నవ్వి "నేను చదివిస్తానమ్మా నిన్ను. సరేనా" అన్నాడు. రెండో అమ్మాయి మరింత గారంపోతూ "నేనూ చదువుకొంటాను" అంది. నారోకట్ పాంటు వేసుకున్న రెండోవాడు "నువ్వు చదివేది నవలలేగా - కొనిస్తాడ్లే" అన్నాడు. అందరూ నవ్వేరు. నాంచారి కళ్ళు తుడుచుకుంటూ " ఇన్నాళ్ళకి ఈ ఇంట్లో మళ్ళీ నవ్వులు వినిపించాయి బాబూ నీ చలవవల్ల" అంది. కుమార్ కళ్ళు కూడా చెమర్చాయి.

అప్పటివరకూ మాట్లాడని పెద్దవాడు కల్పించుకుని "అన్నయ్యా - నీ ఇన్‌ఫ్లుయెన్సు ఉపయోగించి నేనా పరీక్ష కాస్త పాసయ్యేటట్టు చూద్దూ" అన్నాడు. కుమార్ తలూపేడు.

పురుషోత్తం ఆఖరిదానివైపు తిరిగి, "ఆ కిటికీ తెరవ్వే గాలేస్తుంది" అన్నాడు.

"అది తెరిస్తే కాలువ వాసన."

"బాబూ ఇల్లు చూడాలి నువ్వు" అన్నాడు పురుషోత్తం భార్యవైపు తిరిగి "సినిమా సెట్టింగ్‌లా వుంటుంది."

"సెక్రటరీ నవల్లో రాజశేఖరం ఇల్లులాగానా" అంది రెండోది.

అందరూ ఘొల్లున నవ్వారు. "నీ ఇంటిని పొగిడి ఇప్పట్నుంచే నిన్ను కాకాపడుతుందయ్యా నీ చెల్లెలు, నీ స్థాయి బావని తీసుకొస్తావని" అంది నాంచారమ్మ. ఆ రెండో పిల్ల ఉడుక్కుని లోపలికి పరుగెత్తింది.

"ఇన్నాళ్ళకి తమకో అన్నయ్య దొరికాడని వీళ్ళు సంబరపడిపోతున్నారు బాబూ" అన్నాడు పురుషోత్తం. " ఈ ఐదు నిముషాల్లోనే ఎంత సంతోషమో చూడు"

అమ్మా, నేనూ, దీన్ని శాశ్వతం చేసుకోవాలనుకుంటున్నాం నాన్నగారు. మీతోపాటే ఈ ఇంట్లోనే వుండిపోవాలనుకుంటున్నాం."

"అవశ్యం బాబూ, అంతకన్నా కావల్సిందేముంది"

"కలెక్టరన్నయ్యా ఇంత చిన్న ఇంట్లోనా?" అంది మూడోది.

నవ్వుతూ కుమార్ తలెగరేసి "చిన్నప్పట్నుంచీ ఒక్కడినే పెరిగాను. ఇంతమందితో కలిసివుండటంకన్నా ఆనందం ఏముంది. అమ్మ ఎలాగూ నాన్నని వదిలి రాదు" అన్నాడు. అని ఆగి, నెమ్మదిగా "నాన్న పట్లందే తప్ప" అన్నాడు.

పురుషోత్తం చప్పున కొడుకు నోరును చేత్తో మూస్తూ "అంతమాట అనకు బాబూ. ఆ రోజు చేసినదానికి ఎంతో కుమిలిపోయానో ఇదిగో ఈ నాంచారిని అడుగు. కాని ఎక్కడని వెతకం? ఎక్కడో ఒకచోట తను క్షేమంగా వుంటే చాలని దేముడ్ని ఎన్ని మొక్కుకున్నామో ఎవరికి తెలుసు? దేముడి దయవల్ల అంతా సవ్యంగా జరిగింది. ఇక విడిపోవటం అన్న ప్రసక్తే లేదు. అందరం కలిసే వున్న కల్లో గంజో తాగుదాం."

కుమార్ నవ్వి "మరీ అంత హీనస్థితి గాదులెండి. చేసిన అప్పులకి కొంతపోయినా నా

జీతం మిగతాది బాగానే వస్తుంది. అంతా అమ్మకే ఇస్తాను" అన్నాడు.

నాంచారి నొచ్చుకుంటూ "మేం మరీ అంత డబ్బు మనుష్యుల్లా కనబడ్తున్నామా బాబూ. నువ్వు పైసా ఇవ్వక్కర్లేదు. ఇంతకాలం ఇన్ని కష్టాలు పడ్డ అక్కయ్యని ఇకనుంచీ కంటికి రెప్పలా చూసుకుంటాం సరేనా" అంది.

"అదే జరిగితే నేనొచ్చిన పని అయిపోయినట్టే" అన్నాడు కుమార్ లేస్తూ. అతడి కంఠంలో అకస్మాత్తుగా వచ్చిన మార్పుని అక్కడ అందరూ గుర్తించారు. ఏదో అనుమానం వచ్చి గాలి కూడా కదలటం మానేసింది.

కుమార్ మాట్లాడసాగేడు. అతని కంఠం ఈసారి కలెక్టర్ స్వరం లాగానే వుంది. పురుషోత్తానికి దగ్గరగా వెళ్ళి అతనన్నాడు.

"...సరోజనమ్మ నా తల్లి కాదు పురుషోత్తంగారూ. కలెక్టర్ బంగళాలో వంటమనిషి ఆమె సంతానం లేదు. ఒక అర్ధరాత్రి మీ ఫోటో పెట్టుకుని గుడ్లనీరు కక్కుకుంటూంటే నేను చూడటం తటస్థించింది. అప్పుడే నాకు విషయం తెలిసింది. పాతిక సంవత్సరాలయినా మిమ్మల్ని మర్చిపోని ఆమె ప్రేమని చూసి నా హృదయం ద్రవించి ఆమెకోసం ఏదైనా చెయ్యాలనిపించింది. కానీ ఇంతకాలం తరువాత మీరామెని స్వీకరిస్తారో లేదో తెలీదు. అందుకే ఈ నాటకం ఆడవలసి వచ్చింది. ఈమెవరో నాకు తెలీదు అంటారేమో అనుకున్నాను.

కానీ నేను వూహించిన దానికన్నా మీరు గొప్పవాళ్ళుగా కనబడ్డారు. మీ తప్పు సరిదిద్దుకొని, ఆమెను ఆదరించటానికి ఆనందంతో అంగీకరించారు. ఇంతకన్నా కావల్సిందేముంది నాకు? నా పని కూడా అయిపోయింది. వెళ్లొస్తాను" అంటూ సరోజనమ్మ వైపు తిరిగి "వెళ్ళొస్తానమ్మా" అని గుమ్మం దాటేడు. అరనిముషం తరువాత కారు స్టార్టయిన చప్పుడు వినిపించింది.

ఆ గదిలో సూదిపడితే వినబడేంత నిశ్శబ్దం వ్యాపించింది. మనుష్యులు శిలాప్రతిమలల్లే నిలబడిపోయారు. ఎవరి మొహానా కత్తి వాటుకు రక్తపుచుక్క లేదు.

ముందు తేరుకున్నది నాంచారమ్మ. ఒక్కసారిగా కదిలి "అయ్యో - అయ్యో ఎంత ఘోరం - ఎంత ఘోరం" అంది బుగ్గలు నొక్కుకుంటూ. అప్పుడు స్పృహలోకి వచ్చాడు పురుషోత్తం.

"ఇంత మోసం చేస్తావా మమ్మల్ని. నాతో తప్పు వప్పించటం కోసం ఇన్ని నాటకాలు ఆడవలసి వచ్చిందంటే నీకు " అన్నాడు.

సరోజనమ్మ మాట్లాడలేదు. ఇంత చేదు సత్యాన్ని అన్వయం చేసుకోలేనట్టూ చూస్తోంది. "అప్పుడేదో చేస్తే దానికి నిన్నిక జీవితాంతం పోషించాలా - నీ ముసలితనంలో కాళ్ళొత్తాలా?"

అప్పటివరకూ చూస్తున్న పెద్దకుర్రవాడు చేతిలోని చార్మినార్ పాకెట్ 'ఛా' అంటూ నేలమీదకు విసిరికొట్టి లోపలికి వెళ్ళిపోయాడు. కలలమేడ కళ్ళముందే కూలి పోతుంటే దిగాలుపడి కూర్చుంది రెండోది.

నాంచారి భర్తవైపు తిరిగి "మీరు ఇంటికొచ్చి చెప్పగానే అసలు నాకు అనుమానం

వేసిందండీ. ఇన్నేళ్ళ తరువాత ఇదేం ఖర్మరా భగవంతుడా అనుకున్నాను. ఏదో మీ మీద గౌరవం వున్నదాన్ని అవటంచేత మీ మాటకు ఎదురు చెప్పలేక సవితికి హారతిచ్చి మరీ పిలిచాను. అయినా మీది మరో చోద్యమండీ. ఈ వయసులోనే ఆ ఎర్రగా బుర్రగా వున్న కుర్రవాణ్ణి పట్టుకొచ్చి నాటకం ఆడిన ఈ వగలాడి ఆ వయసులో మీ ఒక్కరితోనే వుందనే నమ్మకం ఏమిటి? ఇంకా చూస్తారేమిటండీ - మెడపట్టుకుని బైటకి గెంటక" అన్నది.

పురుషోత్తం కర్తవ్యం స్ఫురించినవాడిలో సరోజని దగ్గరికి వెళ్ళి "నడు - నడు" అని దాదాపు మెడమీద చెయ్యివేసి తొయ్యబోయాడు. అయితే అతడి చెయ్యి మధ్యలోనే గాలిలో ఆగిపోయింది.

కారణం - వీధి గుమ్మం మధ్యలో రెండు తలుపులకి చేతులు ఆన్చి నిలబడిన నిలువెత్తు ఆకారం

అది కుమార్ ది!

రెండోసారి అప్రతిభులయ్యారు. ఆ ఇంటి వారందరూ.

కుమార్ కూడా వెంటనే మాట్లాడలేదు. కొంచెం సేపు మౌనంగా వుండి, తరువాత నెమ్మదిగా ఆమెవైపు తిరిగి "చూసేవా అమ్మా! ఏ జనం కోసం నువ్విన్నాళ్ళూ తపించావో ఆ జనం మనసులో చీకటిమచ్చ! ఈ వ్యక్తి కోసమేనా అమ్మా నువ్విన్నాళ్లూ రాత్రిళ్ళు నిద్ర మానేసి మరీ ఆలోచించింది. ఈ వ్యక్తినేనా అమ్మా నా తండ్రిగా నువ్వు చిత్రీకరించింది... మొగవాడిని-కాబట్టి ఈ మనుష్యుల గురించి నీ కన్నా నాకు ఎక్కువ తెలుసమ్మా. ఐయ్యేయస్ ఆఫీసర్ నీ వెంట వస్తేనే నీకు ఎనలేని గుర్తింపు వస్తుందన్న నిజం నిరూపించటానికి నిన్ను కొద్ది క్షణాలపాటూ వంటమనిషిని చెయ్యవలసి వచ్చింది. అందుకు క్షమించు. వాళ్ళకి కావల్సింది నేనమ్మా - నువ్వు కాదు. అందుకే నేను నీకేమీ కానని అనుకోగానే నిన్ను మెడపట్టుకుని గెంటటానికి కూడా సిద్ధపడ్డాడు నీ భర్త. ఇంకా ఎందుకమ్మా అతడంటే నీకు ప్రేమ?"

ఆమె కొడుకు మాటలు విన్నదో లేదో తెలీదు. ఒక స్వాప్నిక జగత్తులో నడుస్తున్నట్టూ పురుషోత్తం దగ్గరకి వెళ్ళి, ఊహించనంత వేగంతో అతడి చెంపల్ని టపటపా వాయించింది. గదిలో ఆ చప్పుళ్ళు మారుమ్రోగాయి. కొడుకులూ కూతుళ్ళూ ప్రేక్షకులే అయ్యారు. ఉద్వేగంతో తూలి పోతున్న తల్లిని కొడుకు పట్టుకున్నాడు.

ఆ తరువాత అలాగే పొదివి పట్టుకుని ఆమెని గుమ్మం వైపు తీసుకెళ్తూ "ఈ శిల్పాన్ని కష్టపడి చెక్కుకున్న శిల్పివమ్మా నువ్వు. ఈ శిల్పం నీది! కేవలం ప్రతిష్టాపించిన కారణంగా అది ఒక త్రాష్టుడికి దక్కదు. ఇక మన ఇంట్లో ఈ ప్రసక్తే రాకూడదు." అని మెట్లు దిగుతూ ఆగి, తల తిప్పి "ఎవర్నైనా పంపించండి పురుషోత్తమంగారూ - మీ చిన్నప్పటి ఫొటో మా ఇంటి గోడమీద ఎందుకు దిష్టి బొమ్మలాగా" అని తల్లితో సహా సాగిపోయాడు.

❀ ❀ ❀

**(ఆంధ్రపత్రిక - 1972)**